# కథ ముగిసింది

## అగస్త్యప్రగడ హేమంత



సమయం... ఉదయం పదిగంటలయింది. ప్రఖ్యాత రచయిత ప్రవరాఖ్య ఇంట్లో తన పర్సనల్ రూంలో కూర్చుని 'వింతహత్య' సీరియల్ రాస్తున్నాడు. ఇంతలో... కాలింగ్‌బెల్ మోగింది. వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా అపరిచిత వ్యక్తి.

అభిమాన పాఠకులు ఇంటికి రావడం అతనికి కొత్తకాదు. అందుకే ఆ అపరిచితుణ్ణి సాదరంగా లోపలికి ఆహ్వానించాడు. ఇద్దరికీ కాఫీ తెప్పించాడు.

'నేను మీతో ఓ అరగంట మాట్లాడాలి' ఖాళీ కప్ప కింద పెడుతూ చెప్పాడతను.

'మాట్లాడండి' నవ్వుతూ చెప్పాడు ప్రవరాఖ్య.

'పిచ్చిపిల్ల... కథ రాసింది మీరేకదూ!'

'అవును. ఎప్పుడో పది సంవత్సరాల క్రితం రాశాను. అది చదివి చాలామంది పాఠకులు కన్నీరు మున్నీరుగా ఏడ్చారట. చాలా ఉత్తరాలొచ్చాయి. అది నా జీవితంలో మరువురాని అనుభవం!' గొప్పగా చెప్పాడు ప్రవరాఖ్య.

'అవునవును... మీరు రాసిన ఆ కథని అప్పుడు చదివిన మా అమ్మగారు ఇప్పటికీ ఇంకా ఏడుస్తూనే వున్నారు. రోజూ ఆవిణ్ణి ఓదార్చడం చాలా కష్టంగా వుంది' చెప్పి నిట్టూర్చాడతను.

వింటున్న ప్రవరాఖ్యకి గర్వంగా అనిపించింది.

'ప్రేమిచ్చి నవల మీదేననుకుంటాను' అడిగాడతను.

'అవును... ఇరవై ఏళ్ళ క్రితం పెద్దల వల్లనో మరే ఇతర కారణాల వల్లనో విడిపోయిన కొందరు ప్రేమికులు ఆ నవల చదివాకా తిరిగి కలుసుకుని మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. కొన్ని పెళ్ళిళ్ళు నేనే దగ్గరుండి జరిపించాను. ఇది చాలా విచిత్ర సంఘటన కదూ!'

'ఇంకో విచిత్రం ఏమిటంటే... అలా పెళ్ళి చేసుకున్న వాళ్ళలో మా ఆవిడ కూడా వుంది' తలొంచుకుని మెల్లగా అన్నాడతను.

ఈసారి ప్రవరాఖ్య ముఖంలో రంగులు మారాయి. అయినా తమాయించుకున్నాడు.

అతను కుర్చీలోంచి లేచి జేబులో చేతులు పెట్టుకుని గదిలో పచార్లు చెయ్యడం ప్రారంభించాడు. రెండు నిమిషాల తర్వాత హఠాత్తుగా, పచార్లు ఆపి అడిగాడు–

'వింతహత్య సీరియల్ రాస్తున్నది మీరేకదూ!'

'అవును...'

'అందులో రైటర్ పాత్రని చివరికి ఏం చెయ్యదల్చుకున్నారు?'

చెప్పడానికి ప్రవరాఖ్య కొంచెంసేపు తటపటాయించాడు.

'ఫర్వాలేదు... నేనెవరికీ చెప్పను... కేవలం కుతూహలం ఆపుకోలేక అడిగానంతే! మీ కిష్టమయితేనే చెప్పండి' నిజాయితీగా అన్నాడతను.

'అబ్బే! అలాంటిదేంలేదు. వినండి! ఒక రైటర్ చేసిన ఒక రచన వల్ల సమాజంలో మంచి మార్పులు జరగకపోయినా ఫర్వాలేదు. పాఠకులకు ఆహ్లాదం, ఆనందం లభించకపోయినా నష్టంలేదు. కానీ ప్రత్యేకంగా హానీ మాత్రం జరగకూడదు. ఇది నా అభిప్రాయం ప్లస్ నా సీరియల్‌లో కథానాయకుడయిన ఓ పాఠకుడి అభిప్రాయం కూడా!

బైదిబై! మీరు నా అభిమాని కనుక చెబుతున్నాను... ఆ రైటర్ రచనలు చదివి తన ఇంట్లో వాళ్ళందరూ మారిపోవడం సహించలేని ఓ పాఠకుడు చివరికి రైటర్‌ని హత్య చేస్తాడు...'

ప్రవరాఖ్య మాటలింకా పూర్తికాలేదు. కానీ అతను వెంటనే రియాక్టయ్యాడు. జరిగేదేమిటో అర్థమయ్యే లోపలే... అతని చేతిలోని కత్తి ప్రవరాఖ్య గుండెలో దిగబడి పోయింది.

